క్లుప్తంగా

నేడు కంఠమహేశ్వరస్వామి బోనాలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ గ్రామంలో కంఠమహేశ్వరస్వామి బోనాల జాతరను శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్‌గౌడ్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మన్సూరాబాద్ పరిసర ప్రాంతాల్లోని గౌడ కులస్తులు అధిక సంఖ్యలో బోనాలు సమర్పించి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డీసీపీకి ఆహ్వానం

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేటలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు రావాలని డీసీపీ రూపేష్‌ను శుక్రవారం ఓల్డ్‌మలక్‌పేట ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, ఈస్ట్‌జోన్ పీస్ కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి కోరారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, బోనాల ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. చౌకి సురేష్‌కుమార్, వేముల విజయ్‌కుమార్, శివరాజ్, ముప్పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శనివారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు...
సీ క్వార్టర్స్, ముంతాజ్ కాలేజ్ క్రాస్ రోడ్, హనుమాన్ టెంపుల్ పరిసర ప్రాంతాలు
- ఉ11 నుంచి మ. ఒంటి గంట వరకు..
తిరుమలహిల్స్, దిల్‌సుఖ్‌నగర్ రోడ్, పోచమ్మ బస్తీ, గడ్డిఅన్నారం, కమల హాస్పిటల్, నారాయణ కాలేజ్ , ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ, సిద్ధార్థ ఉమెన్స్ కాలేజ్ పరిసర ప్రాంతాలు
- మ. 3 నుంచి సా. 5 గంటల వరకు...
సమత డిగ్రీ కాలేజ్,, డామ్నిక్ స్కూల్ పరిసర ప్రాంతాలు.

అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌గౌడ్



నియామక పత్రాన్ని అందుకుంటున్న ప్రవీణ్‌కుమార్‌గౌడ్

మన్సూరాబాద్: అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్‌కుమార్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు చింతలకుంటలోని రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్య గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ క్రమంలో నాయకులు మిద్దెల మల్లేషం గౌడ్, నళిని గౌడ్, ఆంజనేయులు గౌడ్, మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'అట్టడుగు వర్గాల అభివృద్ధి పట్టని బీఆర్‌ఎస్'

మలక్‌పేట: అట్టడుగు వర్గాలను అభివృద్ధి చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీమధుసూదన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భాగ్యనగర్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పాగ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం మూసారంబాగ్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్పొరేటర్ పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి దళితుడికి దళితబంధు ఇవ్వాలని, పార్టీలకు అతీతంగా కలెక్టర్ ద్వారా ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ పథకంలో ఇళ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, సందడి సురేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

హయత్‌నగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం... అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కొహెడా గ్రామానికి చెందిన సింగిరెడ్డి లక్ష్మారెడ్డి (32) వెల్డింగ్ పని చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి పని ముగించుకొని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తొర్రూర్ నుంచి కొహెడాకు వెళ్లే దారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో లక్ష్మారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆర్థిక సాయం అందజేత


నాగోలు: కొత్తపేట డివిజన్ శివమ్మ నగర్ బస్తీలో నివాసం ఉంటున్న దేవనాయక్ ఇంటి పైకప్పు శుక్రవారం కూలింది. బాధితులు ఈ విషయాన్ని కొత్తపేట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు లింగాల రాహుల్ గౌడ్, సీనియర్ నాయకుడు మహేశ్ రెడ్డికి చెప్పగా.. వారు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి తక్షణ సాయం కింద రూ.10 వేలు పంపించగా, ఆ డబ్బును రాహుల్ గౌడ్, మహేష్ రెడ్డి బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు.

బోనాలకు ఆలయాల ముస్తాబు

- మన్సూరాబాద్‌లో రేపు బోనాలు
- పోచమ్మ గుడితో పాటు ఇతర ఆలయాల వద్ద ఉత్సవాలకు ఏర్పాట్లు
- విద్యుత్ దీపాలతో ఆలయాల అలంకరణ



మన్సూరాబాద్‌లోని పోచమ్మ గుడి ముందు ఏర్పాటు చేసిన సెట్టింగ్



ఆలయంలో కొలువైన పోచమ్మదేవి అమ్మవారు

మన్సూరాబాద్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బోనాలు. అమ్మవారి కరుణ, కటాక్షం తమ కుటుంబంపై ఉండాలని కోరుకుంటూ బోనాల పండుగ నాడు మహిళలు బోనం సమర్పిస్తారు. ఆషాఢ మాస తొలివారంలో ప్రారంభమయ్యే బోనాలు చివరి వారంతో ముగుస్తాయి.

- ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో బోనాల పండుగను ఆదివారం జరుపుకోనున్నారు. ఉత్సవాలకు మన్సూరాబాద్‌లోని అమ్మవారి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. జాతర కోసం ఆయా ఆలయాల కమిటీ నాయకులు అన్ని ఏర్పాట్లు చేశారు.
- మన్సూరాబాద్ శుభోదయకాలనీలోని విజయ దుర్గ దేవాలయం, జడ్జెస్‌కాలనీలో నల్లపోచమ్మ, గ్రామంలోని చిత్తారమ్మ, పెద్దచెరువు కట్టపై కట్టమైసమ్మల ఆలయాలను బోనాల జాతరకు తీర్చిదిద్దుతున్నారు.
- మన్సూరాబాద్‌లోని ప్రధాన ఆలయమైన పోచమ్మగుడిలో బోనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో గుడిని అలంకరించారు. ఆలయం ముందు భారీసెట్ వేశారు. వేలాదిగా వచ్చే భక్తుల మధ్య మహిళలు బోనాలు సమర్పించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు.
- అదే విధంగా మన్సూరాబాద్‌లోని ఇతర అమ్మవారి ఆలయాల వద్ద కూడా బోనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

బోనాల చెక్కులు అందించడంలో నిర్లక్ష్యం



బోనాల పండుగ సమీపిస్తున్నప్పటికీ ఉత్సవాలకు ప్రభుత్వం అందించే చెక్కులు నేటికీ అందలేదు. చెక్కుల పంపిణీలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారు. అమ్మవారి ఆలయాల వద్ద బోనాలు సమర్పించే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం. భక్తులు సమర్పించే బోనాలకు ఆయా ఆలయ కమిటీలు ఎలాంటి రుసుం వసూలు చేయొద్దు. ఆలయాల వద్ద లైటింగ్‌ను ఏర్పాటు చేశాం. ఎప్పటి కప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం.

కొప్పుల నర్సింహారెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్

భక్తులకు ఇబ్బందులు కలగనీయం



బోనాలు సమర్పించే భక్తులకు, అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా షామియానాలు వేస్తున్నాం. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాం. ఆలయం ఎదుట ఆకర్షణ కోసం భారీ సెట్టింగ్ ఏర్పాటు చేశాం. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తుండటంతో బోనాలను ఘనంగా నిర్వహిస్తున్నాం.

కొప్పుల విఠల్‌రెడ్డి, పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్



బోనాల జాతర కరపత్రాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఆలయ కమిటీ సభ్యులు

23న నాగోలులో బోనాలు

నాగోలు: నాగోలు గ్రామంలో ఈ నెల 20 నుంచి 24 వరకు బోనాల జాతర నిర్వహిస్తామని ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, మహంకాళి ఆలయ కమిటీ, శ్రీ పోచమ్మ ఆలయ కమిటీ, నాగోల్ గ్రామ అభివృద్ధి కమిటీ, నవ చైతన్య యువజన సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం నాగోల్ రామాలయంలో జరిగిన సమావేశంలో బోనాల జాతర కరపత్రాలను విడుదల చేసి, జాతర తేదీలను ప్రకటించారు. ఈ నెల 20న శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాలు, 23న శ్రీ మహంకాళి, పోచమ్మ, రేణుక ఎల్లమ్మ, కట్ట మైసమ్మ, ముత్యాలమ్మ, ఈదమ్మ, ఇతర గ్రామదేవతలకు బోనాల సమర్పణ, 24న సాయంకాలం ఫలహారం బండి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

16న రాష్ట్ర వైదిక బ్రాహ్మణ సంఘం కార్యాలయం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వైదిక బ్రాహ్మణ సంఘం నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ రాష్ట్ర వైదిక బ్రాహ్మణ సంఘం కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలో ఈనెల 16న ప్రారంభిస్తామని నిర్వాహకులు మురుకుంట్ల రాజేశ్వర శర్మ, దేరం భాస్కర శర్మ, అవధానుల నర్సింహ ప్రసాద్ శర్మ తెలిపారు. అల్కాపురిలో శుక్రవారం వారు మాట్లాడుతూ, రాష్ట్ర వైదిక బ్రాహ్మణ సంఘం కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు అల్కాపురి శంకర్ మఠంలో జగద్గురు ఆదిశంకరాచార్య విగ్రహ పూజా కార్యక్రమం, శ్రీవిద్య శక్తి పీఠం రామకృష్ణాపురం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణతో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రుద్రవీణ బాలసుబ్రహ్మణ్యం, నారాయణ చక్రవర్తి శర్మ (శ్రీ విద్యా శక్తి పీఠం వ్యవస్థాపకుడు), మాడా వెంకటరమణ శర్మ , మాడ పాపయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ పార్క్ కాలనీలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఎక్కడికక్కడ డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీ రోడ్ నంబర్ 13 లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న సామ రంగారెడ్డి శుక్రవారం కాలనీలో పర్యటించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో కాలనీ వాసులతో కలిసి ఆందోళన చేపడతామని రంగారెడ్డి హెచ్చరించారు. కాలనీవాసులతో పాటు డివిజన్ అధ్యక్షుడు విజయ్ భాస్కర్, ప్రవీణ్ రెడ్డి, కృష్ణం రాజు, రాజేష్ గౌడ్, రాములు గౌడ్, ప్రశాంతి పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

చాదర్‌ఘాట్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. శుక్రవారం అజంపురాకు చెందిన ఆలయాల మేనేజ్‌మెంట్ కమిటీల సభ్యులకు ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ, మలక్‌పేట నియోజకవర్గంలో దాదాపు 100 ఆలయాలకు చెక్కులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో అజంపురా డివిజన్ నాయకులు మారుతి, లాయక్ అలీ పాల్గొన్నారు.



ఆలయ కమిటీలకు చెక్కులు అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం ప్రారంభం



సౌత్‌ఈస్ట్ జోన్ పోలీసు అధికారులతో నగర కమిషనర్ సీవీ ఆనంద్

సైదాబాద్: హైదరాబాద్ నగర పోలీస్ వ్యవస్థలో నూతనంగా ఏర్పాటైన సౌత్‌ఈస్ట్ జోన్‌కు నూతన కార్యాలయం సిద్ధమైంది. సైదాబాద్‌లోని మలక్‌పేట ఏసీపీ కార్యాలయం చౌరస్తా వద్ద నూతనంగా నిర్మించిన సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయ భవనాన్ని శుక్రవారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, నగర పోలీస్ కమిషర్ సీవీ ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్, జోన్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

సైదాబాద్: సకల దేవతా స్వరూపమైన గోవును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ప్రాణిగా ప్రకటించాలని అఖిల భారత గోసేవా ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి కోరారు. గోరక్షణ, గో ఆధారిత వ్యవసాయం, ఉత్పత్తులను ప్రోత్సహించాలని కోరుతూ అరుణాచలం వరకు చేపట్టిన గో మహాపాద యాత్రకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని ఆయన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఆయన ఫౌండేషన్ సభ్యులతో కలిసి మనోహర్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. ఫౌండేషన్ ప్రతినిధి గుడాల రవీజీ తదితరులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాల మద్యం విక్రయానికి యత్నం

ఇద్దరి అరెస్టు

హస్తినాపురం: ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి నగరంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో గల దాస్‌మేష్ గూడ్స్ క్యారియర్‌లో పనిచేస్తున్న దీప్‌కుమార్(19), మేనేజర్ నితిన్‌కుమార్ (30)లు ద్విచక్రవాహనంపై బ్యాగు పెట్టుకుని అనుమానాస్పదంగా కనిపించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద ఉన్న బ్యాగును సోదా చేయగా పంజాబ్ రాష్ట్రానికి చెందిన 12 ఓడ్కా మద్యం బాటిళ్లు దొరికాయి. మద్యం బాటిళ్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

చాదర్‌ఘాట్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అక్బర్‌బాగ్ డివిజన్ ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన ధనలక్ష్మి (35)కి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త స్థానికంగా ఉన్న స్వీట్ షాపులో పని చేస్తుండగా, ఆమె టైలరింగ్ పని చేసేది. కొంతకాలంగా ధనలక్ష్మి అనారోగ్యం బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఆమె శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పక్కింటివారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బోనాలు

సైదాబాద్: గడ్డిఅన్నారంలోని నల్లపోచమ్మ ఆలయంలో శుక్రవారం బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుధీర్‌గౌడ్, రామాంజనేయులు గౌడ్, లింగాల సునీల్‌గౌడ్ శివకుమార్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న లింగాల హరిగౌడ్

ఆలయాలకు బోనాల చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తున్నదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని సుమారు 157 ఆలయాలకు బోనాల చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా ఆలయాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు దోహదపడుతున్నదని చెప్పారు. బోనాలకు నియోజకవర్గానికి రూ.15 కోట్లను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని, ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆలయాల వద్ద వీధి దీపాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు.

అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న దేవాదాయ శాఖ: బీజేపీ



హయత్‌నగర్ పోలీసుల అదుపులో ఉన్న కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు

హయత్‌నగర్: రాష్ట్ర దేవాదాయ శాఖ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, బీఆర్‌ఎస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని బీజేపీ నాయకులు ధ్వజమెత్తారు. బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ఆలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆలయ కమిటీలకు పంపిణీ చేయాడాన్ని నిరసిస్తూ శనివారం నియోజకవర్గంలోని బీజేపీ కార్పొరేటర్లు ఎల్‌బీనగర్‌లోని హనుమాన్ ఆలయం వద్ద ధర్నా చేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ శ్రేణులు,బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రయ్య, ఎస్సీ మోర్చా నాయకులు కొప్పు బాషా, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సామ రంగారెడ్డి హ యత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ, ఎన్నికలు దగ్గర పడుతుండటంతో అధికార పార్టీ నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని, ప్రభుత్వ ఇచ్చే నిధులను తాము సొంతంగా ఇస్తున్నట్లు చెప్పుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఏడాది బోనాల చెక్కులను ఎల్‌బీనగర్‌లోని హనుమాన్ ఆలయంలో ఇవ్వగా, ఈ ఏడాది ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఎలా ఇస్తారని వారు ప్రశ్నించారు. అధికార పార్టీ నాయకులను ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేయాలని చూస్తున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, వంగా మధుసూదన్ రెడ్డి, బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్, రాధా ధీరజ్‌తో పాటు పలు డివిజన్ల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో బోనాల చెక్కుల పంపిణీ ఏంటి?

కాంగ్రెస్‌పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ రాంరెడ్డి

ఎల్‌బీనగర్: బోనాల ఉత్సవాల నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆలయాల నిర్వహణకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి దొంగచాటుగా పంపిణీ చేయటం సిగ్గుచేటని కాంగ్రెస్‌పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. చైతన్యపురిలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో ప్రసన్నాంజనేయ ఆలయంలో కార్పొరేటర్లతో కలిసి బోనాల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే..ఇప్పుడు తన రాజకీయ స్వార్థం కోసం తన ఇంటి వద్ద పంపిణీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సొమ్మును ప్రొటోకాల్ పాటిస్తూ పంపిణీ చేయాల్సి ఉండగా, తన సొంత డబ్బు పంపిణీ చేస్తున్నట్టు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్థానిక వార్డు కార్యాలయాల్లో పంపిణీ చేయకుండా తన ఇంట్లో పంపిణీ చేయడం సిగ్గుచేటన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు వత్తాసు పలుకుతున్నారని, ఎల్లప్పుడు ఈ ప్రభుత్వమే ఉండదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

చంచల్‌గూడ: ఆలయాల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పూలతోటలో నిర్మించిన ఒంటి జడ మైసమ్మ ఆలయ ముఖ ద్వారాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్రతి ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. పూలతోట నివాసితుల సంఘం సభ్యులు కుమార్, సుదర్శన్‌యాదవ్, రాజేశ్వర్‌యాదవ్, శశిధర్‌రెడ్డి, నందు యాదవ్, బి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్య ధోరణిపై ఫిర్యాదు

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ సౌత్ జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన టి.వెంకన్నను శుక్రవారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి బండ్లగూడ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్‌సీకి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్‌లోని వివిధ సమస్యలు, అభివృద్ధి పనులపై జడ్‌సీతో చర్చించినట్లు కార్పొరేటర్ తెలిపారు. అధికారుల పని తీరు, అభివృద్ధి పనులు చేయడంలో కాంట్రాక్టర్లు అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కొందరు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

బీసీల ప్లీనరీని విజయవంతం చేయండి: జాజుల



కేబీఆర్ కన్వెన్షన్‌లో జరిగే బీసీల ప్లీనరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

మన్సూరాబాద్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీల ప్లీనరీని విజయవంతం చేయాలని సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. బీసీల రాజకీయ సాధికారత సాధన కోసం మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్‌లో శనివారం నిర్వహించనున్న ప్లీనరీ ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, బీసీలు రాజకీయంగా తరతరాలుగా అన్యాయానికి గురవుతున్నారని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించేందుకు ప్లీనరీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఎన్నికల్లో బీసీలు అనుసరించాల్సిన ఎత్తుగడలపై ప్లీనరీలో సుదీర్ఘ చర్చ జరుపుతామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారి, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్కచర్ల శ్రీనివాస్, నాయకులు కనకాల శ్యామ్‌కుర్మ, సింగం గణేష్, నర్సింహ, కిరణ్, కృష్ణ, జాజుల భాస్కర్, భీమగోని మహేష్, చింకింది స్వామికుమార్, భరత్, సాయి, రవి, మాద శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం: సామ



ప్రజలకు కేంద్ర పథకాలను వివరిస్తున్న సామ రంగారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మాయమాటలతో పేదలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా సామ రంగారెడ్డి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి శుక్రవారం మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్ట, స్వాతి గార్డెన్స్, ఫణిగిరి కాలనీ, బొమ్మలగుడి ప్రాంతంలో పాదయాత్ర చేపట్టి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వీరన్నగుట్టలో పేదలకు 60 గజాల చొప్పున స్థలం కేటాయిస్తూ పట్టాలిచ్చిందన్నారు. 59 జీఓ కింద వీటిని రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలతో దరఖాస్తు చేయించిందన్నారు. ఇలా దరఖాస్తు చేసిన వారికి లక్షల రూపాయలు చెల్లించాలంటూ మెస్సేజ్‌లు పంపించిన ప్రభుత్వం...ఇప్పుడు డబ్బు కట్టకపోతే రెవెన్యూ అధికారులతో కూల్చివేయిస్తామని బెదిరింపులకు పాల్పడుతోందని రంగారెడ్డి విమర్శించారు. ప్రభుత్వం గుర్తించిన నోటిఫైడ్ స్లమ్స్‌లో మార్కెట్ ధరలో 10 శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని జీఓలో పేర్కొని, దానికి విరుద్ధంగా ప్రభుత్వం లక్షల రూపాయలు చెల్లించాలంటోందని మండిపడ్డారు. పేదలను మోసం చేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని దుయ్య బట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడం బీజేపీతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో తమ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాంపల్లి రామేశ్వర్, కొండల్‌రెడ్డి, కోటయ్య, జయతేజ, బాలాజీ, రమేష్‌చారి, నాగిరెడ్డి, ముత్యంరెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, మంగయ్య, వినోద్ పాల్గొన్నారు.